క్లుప్తంగా...

పదవీ విరమణ వయసు పెంపుపై హర్షం

నాంపల్లి: యూజీసీ వేతనాలు పొందుతున్న విశ్వవిద్యాలయాల అధ్యాపకుల పదవీ విరమణ వయస్సు 60 నుంచి 65 ఏళ్లకు పెంచుతూ సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయానికి తెలుగు విశ్వవిద్యాలయం బోధనా సంఘం కృతజ్ఞతలు తెలియజేసింది. శుక్రవారం నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో కృతజ్ఞత సభను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు హాజరై ప్రసంగించారు. బోధనా సిబ్బంది వయసు పెంపు నిర్ణయం చారిత్రాత్మకమైనదని హర్షాన్ని వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం అధ్యాపకుల అనుభవం విద్యా వ్యవస్థకు అమూల్యమైనదన్నారు. వర్సిటీ బోధనా సంఘం అధ్యక్షురాలు డాక్టర్ వనజ ఉదయ్, సంగీత శాఖ శాఖాధిపతి డాక్టర్ రాధ సారంగపాణి, డాక్టర్ పద్మప్రియ, డాక్టర్ రత్నశ్రీ, డాక్టర్ గడ్డం వెంకన్న, డాక్టర్ మరపు వెంకటేశం, డాక్టర్ ఓని విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు నివాళి

గౌలిపురా: తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపించిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కె.వెంకటేశ్ అన్నారు. ప్రజా గాయకుడు గద్దర్ జయంతి సందర్భంగా శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకటేశ్ పాల్గొని గద్దర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటేశ్ మాట్లాడుతూ..70 ఏళ్లుగా ప్రజల కోసం గద్దర్ గొంతు ఆడింది.. పాడిందన్నారు. తన పాటలు, సాహిత్యం ద్వారా ప్రజల్ని చైతన్య పరిచిన ఉద్యమ దీపిక గద్దర్ అన్నారు.

ఉద్యోగులకు అండగా ఎంప్లాయీస్ యూనియన్



మహ్మద్ షకీల్‌ను సన్మానిస్తున్న రాంబాబు యాదవ్, లక్ష్మీనారాయణ

గన్‌ఫౌండ్రీ: ఉద్యోగులకు అండగా ఎంప్లాయీస్ యూనియన్ నిరంతరం పాటుపడుతుందని మెట్రో వాటర్‌బోర్డు ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు రాంబాబు యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం వాటర్‌బోర్డు ఉద్యోగి మహ్మద్ షకీల్ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాంబాబు యాదవ్ మాట్లాడుతూ..దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వాటర్‌బోర్డు ఉద్యోగులు, కార్మికుల సమస్యలను అంచెలంచెలుగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎలమయ్య, లక్ష్మీనారాయణ, జమీల్ అహ్మద్, మహ్మద్ ఖలీల్, కొమురయ్య, జీఎం శ్రీనివాస్, షేక్ దావూద్, వేణుగోపాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడితే శిక్ష తప్పదు

చార్మినార్: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడితే శిక్ష తప్పదని చార్మినార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ అన్నారు. శుక్రవారం చార్మినార్ పోలీస్ స్టేషన్ పరిధిలో తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో నలుగురు వాహనదారులు పట్టుబడడంతో వారిని న్యాయమూర్తి ముందు హాజరు పరిచగా జరిమానాతో పాటు జైలు శిక్ష విధించారన్నారు. పి.అశుతోష్‌కు న్యాయమూర్తి రూ.2100 జరిమానాతో పాటు ఒక రోజు జైలు శిక్ష విధించారన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రెండోసారి పట్టుబడిన బికాస్ కోలేకు రూ.3300 జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష పడిందన్నారు. డి.రవి కుమార్ కూడా 2వ సారి పట్టుబడడంతో రూ.3300 జరిమానాతో పాటు రెండు రోజులు జైలు శిక్ష పడిందన్నారు. అలాగే కుర్వ వెంకటయ్య 3వ సారి పట్టుబడడంతో జరిమానా రూ.3300 జరిమానాతో పాటు ఐదు రోజుల జైలు శిక్ష పడిందన్నారు.

రైల్వే స్టేషన్‌లో యాచకులకు కౌన్సెలింగ్

నాంపల్లి: రైల్వే స్టేషన్ల పరిసర ప్రాంతాల్లో సంచరించే 30 మంది యాచకులకు హైదరాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రైల్వే స్టేషన్‌లో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన అధ్యక్షతన జరిగిన కౌన్సెలింగ్‌కు రెండవ జేఎంఎఫ్‌సీ ఆఫ్ రైల్వే కోర్టు మెజిస్ట్రేట్ మహ్మద్ గౌస్ పాషా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యాచకులు యాచక వృత్తిని వీడాలని సూచించారు. తల్లిదండ్రులు రైల్వే స్టేషన్లలో యాచిస్తుంటే వారి పిల్లలు కూడా అదే బాటలో నడుస్తారని, అలాంటి పరిస్థితి రాకుండా పెద్దలు కూడా సన్మార్గంలో నడవాలని కోరారు. అనంతరం యాచకులకు వారి పిల్లలకు జ్యూస్, బిస్కెట్ పాకెట్లు, చాక్లెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు నసీమా, వి.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వామ్మో దోమలు..!

- కార్వాన్ నియోజకవర్గంలో విజృంభిస్తున్న దోమలు
- ప్రబలుతున్న వ్యాధులు
- డంపింగ్ యార్డులుగా మారుతున్న నాలాలు, చెరువులు
- కానరాని మలేరియా సిబ్బంది



దోమల ఉత్పత్తి కేంద్రంగా మారిన షేక్‌పేట్ కొత్త చెరువు



షేక్‌పేట్ ఎర్రకుంట చెరువు వద్ద వ్యర్థాల డంపింగ్

గోల్కొండ: ఓవైపు సవ్యంగా సాగని పారిశుద్ధ్య పనులు..మరో వైపు చెరువులు, నాలాల్లో వ్యర్థాల డంపింగ్‌లతో ప్రజలు బేజారెత్తిపోతున్నారు. టన్నుల కొద్ది వ్యర్థాలతో చెరువులు, నాలాలు నిండుకున్నాయి. ఈ విధంగా చెత్తతో నిండిన చెరువులు, నాలాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. దోమల నివారణకు నియమించబడిన మలేరియా సిబ్బంది మచ్చుకైనా కానరావడం లేదు. గుడిమల్కాపూర్, అహ్మద్‌నగర్, షేక్‌పేట్, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో దోమలు పగలు, రాత్రి విజృంభిస్తున్నాయి. ఇటు పారిశుద్ధ్యం వారు..అటూ మలేరియా వారు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అహ్మద్‌నగర్ నాలా, షేక్‌పేట్ బుల్కాపూర్ నాలాల్లో వ్యర్థాలు నిండి అవికాస్తా కుళ్లిపోయాయి. కుళ్లిన వ్యర్థాలకు తోడుగా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు దోమల ఉత్పత్తికి సహకరిస్తున్నాయి. బస్తీలు, కాలనీల్లో రోడ్డుపైనే చెత్త కుప్పల పక్క నుంచే డ్రైనేజీ నీరు పారుతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

సర్వేలలో మలేరియా సిబ్బంది..

ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం జరుగుతున్న ఇంటింటి సర్వేలో గత నెల రోజులుగా మలేరియా సిబ్బంది సేవలను ప్రభుత్వం వాడుకుంటుంది. దీంతో దోమల నివారణకు మందు పిచికారీ చేయడం పూర్తిగా ఆగిపోయింది. దీంతో దోమలకు అడ్డూ అదుపు లేకుండాపోయింది. కార్వాన్ నియోజకవర్గంలో వివిధ వార్డులకు కేటాయించిన మలేరియా సిబ్బంది సూపర్‌వైజర్లు మొత్తం వివిధ సర్వేలలో విధులు నిర్వహించడం వల్ల దోమల మందు పిచికారీ పని పూర్తిగా ఆగిపోయింది. ఇదే అదునుగా ప్రజలు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారు. మరోవైపు మలేరియా సిబ్బంది మాత్రం సర్వే ఎప్పుడెప్పుడు పూర్తి అవుతుందా అని ఎదురు చూస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణం..



అధికారుల నిర్లక్ష్యం కారణంగానే దోమలు వృద్ధి చెందుతున్నాయి. నాలాల్లో వ్యర్థాల డంపింగ్‌ను ఆపాలి. చెరువుల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, పిచ్చి మొక్కలను తొలగించి వాటిని సుందరీకరించాలి. ప్రస్తుతం ఉన్న మలేరియా యూనిట్ల సంఖ్యను పెంచి ప్రతి నిత్యం బస్తీలు, కాలనీల్లో మందును పిచికారీ చేయాలి. – కె.మోహన్‌రెడ్డి, షేక్‌పేట్

డంపింగ్ యార్డులుగా చెరువులు, నాలాలు..

చెరువులు, నాలాలు డంపింగ్ యార్డులుగా మారాయి. గుడిమల్కాపూర్ మార్కెట్ యార్డు వెనకాల ఉన్న నాలాలో కూరగాయల వ్యర్థాలు యథేచ్ఛగా డంపింగ్ అవుతున్నాయి. అదే విధంగా అహ్మద్‌నగర్‌లోని బుల్కాపూర్ నాలాను ఆనుకొని ఉన్న ఇళ్ల వారు వ్యర్థాలను నాలాలో పారపోస్తున్నారు. కార్వాన్ రోడ్డులో గల నాలా సైతం డంపింగ్ యార్డుగా మారింది. షేక్‌పేట్ కొత్త చెరువులో ఫిల్మినగర్, షేక్‌పేట్, అంబేడ్కర్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి ఆటో ట్రాలీలలో వ్యర్థాలను తెచ్చి డంపింగ్ చేస్తున్నారు. షేక్‌పేట్‌లోని బుల్కాపూర్ నాలా సైతం వ్యర్థాల డంపింగ్‌కు నిలయంగా మారింది. ఈ డంపింగ్ యార్డులు దుర్వాసన వెదజల్లుతూ దోమల ఉత్పత్తి స్థానాలుగా మారాయి.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. 32/11 కేవీ గోల్కొండ, ఐటీఐ మల్లేపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని వీబీఆర్ఐ, సైస్ ఆస్పత్రి, ఐటీఐ మల్లేపల్లి, ఎ బ్యాటరీ లైన్, విజయనగర్ కాలనీ, లక్ష్మీనగర్, హుస్సేని మజీద్, పోలీస్ క్వార్టర్స్, కో ఇ సర్ కాలనీ, మినీ బృందావన్ కాలనీ, విరాట్‌నగర్, హకీంపేట కుంట, హకీంషా, టోటల్ గ్యాస్ పెట్రోల్ పంప్, ఇందిరానగర్, ధోబీఘాట్, గాంధీ విగ్రహం ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

హైదర్‌గూడా విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ హైదర్‌గూడా విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. షా గంజ్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు..లాడ్ బజార్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు..ఘాజి బండ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

ఫలక్‌నుమా సీబీడీ ఏఈఈ పరిధిలో..

గౌలిపురా విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. షా జహాన్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే డార్జిలింగ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కార్యక్రమంలో ఎంవీఐలు రవీందర్, సురేష్ కుమార్

చాంద్రాయణగుట్ట: వాహనాలు నడిపేవారు వేగం తగ్గించుకోవడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని దక్షిణ మండలం ఆర్టీఏ ఎంవీఐలు గంట రవీందర్, జె.సురేష్ కుమార్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవంలో భాగంగా చాంద్రాయణగుట్టలోని బీసీ బాయ్స్ హాస్టల్, అలియాబాద్‌లోని గర్ల్స్ హాస్టల్‌లో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..చిన్న చిన్న నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువై విలువైన ప్రాణాలు పోతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం మత్తులో వాహనాలను నడపరాదన్నారు. అనంతరం విద్యార్థులతో రోడ్డు సేఫ్టీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ పద్మ, ఆర్టీఏ కానిస్టేబుల్ మహేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్ మార్కెట్‌లో ఆకస్మిక తనిఖీ



తనిఖీ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్

గోల్కొండ: గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్ శుక్రవారం మార్కెట్ యార్డులోని కూరగాయాల మార్కెట్, పూల మార్కెట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆయన పి.ఇంద్రారెడ్డి పూలమార్కెట్‌ను సందర్శించారు. పూల మార్కెట్‌లో కేటాయించబడిన స్టాల్స్‌ను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పూల వ్యాపారులతో మాట్లాడి వ్యాపారం జరుగుతున్న తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు. ఏఏ ప్రాంతం నుంచి రైతులు ప్రతిరోజూ తెస్తున్న వివిధ రకాల పూలు, వాటి లభ్యత, అమ్మకాల విషయంపై ఆయన పూలవ్యాపారులతో మాట్లాడారు. అనంతరం ఆయన కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. సీజనల్ కూరగాయలను రైతులు తెస్తున్న వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన వ్యాపారులకు మార్కెట్ యార్డులో ఎదురవుతున్న ఇబ్బందులు, వారికి కావాల్సిన అభివృద్ధి పనుల విషయమై చర్చించారు.


ముగిసిన అంతర్జాతీయ సదస్సు



అవార్డులు ప్రదానం చేస్తున్న ఎ.కె.సింగ్, వి.కె.సింగ్

సంతోష్‌నగర్: శిలాజ ఇంధన వినియోగాన్ని తగ్గించడంతో స్థితిస్థాపకతను తగ్గించడం సాధ్యమని బిహార్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సిలర్ డాక్టర్ ఎ.కె.సింగ్ అన్నారు. సంతోష్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్–సీఆర్‌డీఏ)లో వర్షాధారిత వ్యవసాయం, స్థితిస్థాపకత, స్థిరమైన జీవనోపాధికి మార్గాలను నిర్మించడం అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన 2వ అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నీటి సేకరణ, సేకరించిన నీటిని సమర్థవంతంగా ఉపయోగించడం, నేల, నీటి సంరక్షణ కోసం సాంకేతికతలను వివరించారు. ముగింపు సభ చైర్మన్ డాక్టర్ జె.ఎస్.సామ్రా తన ప్రసంగంలో నేషనల్ రెయిన్‌ఫెడ్ ఏరియా అథారిటీ (ఎన్ఆర్ఏఏ) మాజీ సీఈఓ రెండో అంతర్జాతీయ సదస్సును నిర్వహించిన ఐసీఏఆర్–సీఆర్‌ఐడీఏని అభినందించారు. సెషన్ వారీగా ప్రజెంటేషన్ అవార్డులు, ఉత్తమ పోస్టర్ అవార్డులను ఐసీఏఆర్–సీఆర్‌ఐడీఏ డైరెక్టర్ డాక్టర్ వీ.కే.సింగ్ ప్రదానం చేశారు. అంతకుముందు ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతినిధులు, విశిష్ట ప్రముఖులను ఏఐసీఆర్‌పీడీఏ ప్రాజెక్టు కో ఆర్డినేటర్, సీఎస్‌డీఏ కార్యదర్శి డాక్టర్ జెవీఎన్ఎస్ ప్రసాద్‌ను స్వాగతించారు.


'అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ఎంతో గొప్పది'



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు కేశవ్

జియాగూడ: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ఎంతో గొప్పదని ఇందిరానగర్ ఆది జాంభవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశవ్ శుక్రవారం అన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జియాగూడ ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, ఉపన్యాసం పోటీలు, పర్యావరణ పరిరక్షణ, హైదరాబాద్ సిటిజన్ ఫోరమ్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా హైదరాబాద్ సిటిజన్ ఫోరమ్ కో ఆర్డినేటర్ పి.నాగేశ్వర్ మాట్లాడుతూ..విద్యార్థులు భారత రాజ్యాంగంపై అవగాహన, గౌరవం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి తేజ, టీచర్లు దేవేందర్, మీనాక్షి దేవి, సుఖ్‌పాల్, స్వయం సహాయక గ్రూఫ్ ప్రతినిధులు లావణ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

విమర్శవల్లే ఉత్తమ రచనలు



గ్రంథావిష్కరణ చేస్తున్న ఆచార్య ఎల్లూరి శివారెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: పాఠకుల్లో సాహిత్య అభిరుచిని పెంచి మంచి రచనలు రావడానికి దోహదం చేసే ప్రక్రియ విమర్శ అని వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ రూపొందించిన 'తెలుగు సాహిత్య విమర్శ–పర్యాలోచన' అనే గ్రంథావిష్కరణ అనే సభ శుక్రవారం సాయంత్రం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ తెలుగు సాహిత్యం ఉన్నత ప్రమాణాలు సాధించడానికి దోహదపడే అనేక శిక్షణ శిబిరాలను పరిషత్ నిర్వహిస్తుందన్నారు. డాక్టర్ సుజాతారెడ్డి మాట్లాడుతూ..తెలుగులో కందుకూరి వీరేశలింగం మొదటి విమర్శ గ్రంథాన్ని రాశారని గుర్తుచేశారు. ప్రముఖ సాహితీవేత్త ఆచార్య ఎస్వీ రామారావు, మాసన చెన్నప్ప, డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ డి.చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ వి.త్రివేణి, డాక్టర్ మారోజు దేవేంద్ర తమ ప్రసంగాలలో సాహిత్య విమర్శ చరిత్రను ప్రసంగించారు.

విద్యార్థుల కెరీర్ రూపకల్పనలో సీఎస్ కోర్సులు కీలకం

చార్మినార్: కామర్స్ మేనేజ్‌మెంట్ విద్యార్థుల కెరీర్ రూపకల్పనలో సీఎస్ కోర్సులు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) అసోసియేట్ మెంబర్ గౌరవ్ అగర్వాల్ అన్నారు. ప్రభుత్వ సిటీ కాలేజ్, హైదరాబాద్ కామర్స్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) సంయుక్తంగా శుక్రవారం కెరీర్ అవగాహన–కంపెనీ సెక్రటరీ అనే అంశంపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. విప్లవ దత్ శుక్ల అధ్యక్షత వహించారు. తన ప్రసంగంలో కంపెనీ సెక్రటరీ (సీఎస్) వంటి వృత్తి కోర్సులు కామర్స్ మేనేజ్‌మెంట్ విద్యార్థుల కెరీర్ రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తాయని తెలియజేశారు. తదుపరి సెషన్‌లో విద్యార్థి కోఆర్డినేటర్ ఎం.బి. ప్రవీణ్ కుమార్ కంపెనీ సెక్రటరీ కోర్సు ప్రణాళిక, దాని ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసిన ఫ్యాకల్టీ సభ్యురాలు ఇఫాత్ ఉన్నీసా బేగంతోపాటు, డా. మల్లికార్జునరావు (విభాగాధిపతి), డా. రూప్సీరాణి, డా. శిరీషా, లలిత, అరుణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

తహసీల్దార్ జ్యోతికి సత్కారం




జియాగూడ: బెస్ట్ వర్కర్‌గా హైదరాబాద్ ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతి హైదరాబాద్ కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకోవడం హర్షణీయమని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్ టీమ్ క్లబ్ పర్మనెంట్ ప్రాజెక్ట్ చైర్మన్ లయన్ వైలా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం విజయనగర్‌కాలనీలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆమెను కలిసి మెమొంటో అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఫెస్టివల్స్ క్లబ్ చైర్మన్ లయన్ ప్రమోద్ గోపిశెట్టి, ఉపాధ్యక్షులు లయన్ తోట శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు

యాకుత్‌పురా: పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మంజురైన చెత్త తరలింపు రిక్షాలను శుక్రవారం తలాబ్‌కట్టాలో ఆయన తలాబ్ చంచలం కార్పొరేటర్ సమీనాబేగంతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఇంటింటికీ తిరుగుతూ చెత్త సేకరించేందుకు జీహెచ్ఎంసీ 50 రిక్షాలను మంజురు చేయగా ఇందులో రెయిన్ బజార్‌కు–15, తలాబ్ చంచలంకు–20, సంతోష్‌నగర్‌కు–15 కేటాయించారన్నారు. మజ్లిస్ పార్టీ నాయకులు, జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్ మారుతీప్రసాద్‌కు సిల్వర్ మెడల్



అబిడ్స్: పోలీస్ శాఖ ఇన్‌స్పెక్టర్ కాసుల మారుతీ ప్రసాద్‌కు రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ లభించింది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ..పోలీసు విధులు ఒక వైపు నిర్వహిస్తూ మరో వైపు క్రీడా రంగంలో జాతీయ స్థాయిలో రాణించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. మరింత పట్టుదలతో విజయాలు సాధించేందుకు కృషి చేస్తానన్నారు. ఐజీ మల్టీజోన్–1 ఐపీఎస్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఆయనకు సిల్వర్ మెడల్ అందజేసి అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

గోల్కొండ: ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలని నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్ అన్నారు. శుక్రవారం షేక్‌పేట్ జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ట్రాఫిక్, ప్రమాదాల నివారణ అనే విషయంపై అవగాహన సదస్సు జరిగింది. జీఎన్ఐటీఎస్ అభయ షీ–సేఫ్టీ ఫర్ హర్ ఎస్యూర్డ్ సౌజన్యంతో జరిగిన కార్యక్రమంలో ఆయన విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, టోలిచౌకీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సుధాకర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు ఉన్నారు.



ఇందిరమ్మ రాజ్యంతోనే అన్ని వర్గాల సంక్షేమం



అఫ్జల్‌గంజ్: గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్‌లో ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి మేయర్ గద్వాల విజయలక్ష్మితో కలిసి గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకురాలు, మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా స్వాగతం పలికారు. మేయర్, మమతా గుప్తా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇందిరమ్మ రాజ్యంతోనే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కొనసాగుతుందన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



గెలుపొందిన వారికి మెమొంటోలు బహూకరిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ రేతిగల్లిలోని జీఎంకే ప్రైడ్ గార్డెన్‌లో జరిగిన యువ క్రీడాకారుల సన్మాన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రెజ్లింగ్, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్‌తో పాటు ఇతర క్రీడా అంశాల్లో సత్తాచాటిన వారికి బహుమతులు అందజేశారు. గత సంవత్సరం పూర్తిగా నిలకడ సాధించి నగర స్థాయి, రాష్ట్ర స్థాయి వేదికలపై పతకాలు సాధించిన వారిని ఆయన పూలమాలలు వేసి మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ తరం యువత రెజ్లింగ్‌తో పాటు బాక్సింగ్ వైపు కూడా ఆసక్తి కనబరుస్తున్నారని ఇది ఒక శుభపరిణామం అని ఆయన అన్నారు. బల్దియా తరపు నుంచి నియోజకవర్గంలో బాక్సింగ్, రెజ్లింగ్‌తో పాటు అవుట్ డోర్ ఆటలైన ఫుట్‌బాల్, వాలీబాల్‌లలో శిక్షణ ఇచ్చేందుకు కోచ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు షకీల్ అలీఖాన్, జుబేర్ బిన్ అవద్ తదితరులున్నారు.

ఉద్రిక్తతల మధ్య శంకుస్థాపన

గోషామహల్ నలుమూలలా పలు పార్టీ నాయకుల అరెస్ట్



బీఆర్ఎస్ నేత ఆనంద్‌కుమార్ గౌడ్, బీజేపీ నేత నితిన్ నందకర్‌ను అరెస్ట్ చేసిన అఫ్జల్‌గంజ్ పోలీసులు



కార్పొరేటర్ సురేఖ, బీజేపీ నేత భీశ్వ ఓంప్రకాష్‌ను హౌజ్ అరెస్ట్ చేసిన అబిడ్స్ పోలీసులు



ధర్నా చేస్తున్న గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్ తదితరులు

అబిడ్స్: ఉద్రిక్తతల మధ్య ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కొన్ని నెలలుగా గోషామహల్‌లోని ఆల్ పార్టీల నాయకులు ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించొద్దంటూ ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. శుక్రవారం గోషామహల్ నియోజకవర్గంలోని పలు పార్టీల నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్, భీశ్వ ఓంప్రకాష్, కార్పొరేటర్లు సురేఖ, లాల్ సింగ్, నాయకులు కేడి దినేష్, ఆశిష్ కుమార్‌యాదవ్, సురేష్ ముదిరాజ్‌లతో పాటు పలు నేతలను పోలీసులు ముందుగానే అరెస్టు చేశారు. గోషామహల్ ప్రాంతాన్ని పోలీసులు అష్టదిగ్బంధం చేశారు. ముందుగానే వ్యాపారస్తులు దుకాణాలను మూసివేసి నిరసనలను వ్యక్తం చేశారు. ఫ్లెవుడ్, హార్డ్‌వేర్, బ్యాంగిల్ స్టోర్‌లతో పాటు పలు అసోసియేషన్ల వ్యాపారులు దుకాణాలను మూసివేసి నిరసన వ్యక్తం చేశారు.

పోలీసుల ఆంక్షలతో అవస్థలు..

పోలీసుల ఆంక్షలతో స్థానికులు అవస్థలకు గురయ్యారు. ముఖ్యమంత్రి వస్తుండడంతో పోలీసు గ్రౌండ్స్ పరిసరాల్లో ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. పరిసర ప్రాంతాల్లో భారీ ఎత్తున పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

స్థానికులతో కలిసి కార్పొరేటర్ ఆందోళన..

అఫ్జల్‌గంజ్: కొన్ని రోజులుగా ఉస్మానియా ఆసుపత్రిని వ్యతిరేకిస్తున్న నాయకులను శుక్రవారం ఉదయం నుంచే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్‌ను సైతం పోలీసులు ఉదయం అదుపులోకి తీసుకోగా ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వాన పత్రికలో తన పేరు ఉందంటూ ఆయన కార్యక్రమానికి హాజరై కార్యక్రమం అనంతరం స్థానికులతో కలిసి ఆందోళన చేపట్టారు.

పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేత



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ నాగదుర్గా ప్రసాద్



భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి

గౌలిపురా: నేరాల నియంత్రణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు మొఘల్‌పురా పోలీసులను శుక్రవారం నగర పోలీస్‌కమిషనర్ సీవీ ఆనంద్ ప్రశంసాపత్రం, రివార్డుతో అభినందించారు. మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్, ఎస్సై నరేశ్, కానిస్టేబుల్ అనిల్‌కు ప్రశంసాపత్రం, రివార్డుతో అభినందించారు.

భవానీనగర్ ఇన్‌స్పెక్టర్‌కు..

హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా ఈ–పెట్టీ కేసుల్లో నిందితులకు జైలుకు పంపినందుకు భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామికి నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ప్రశంసాపత్రం, రివార్డుతో అభినందించారు. భవానీనగర్ పోలీస్‌స్టేషన్‌లో వివిధ ఈ–పెట్టి కేసుల్లో 80 మంది నిందితులను జైలుకు తరలించి మొదటి స్థానంలో నిలువడంతో బాలస్వామికి ప్రశంసాపత్రంతో సన్మానించారు.